సాక్షి
విశాఖపట్నం
బుధవారం । 25 । జూన్ । 2025


అదివో జగన్నాథుడు..
అల్లదివో రథోత్సవం.. 8లో


ఘనంగా ప్రపంచ
హైడ్రోగ్రఫీ దినోత్సవం 8లో


నేలవేషాలు
కేరాఫ్ ముచ్చర్ల 8లో

క్యాంపస్‌లో కొలువుల్లేవు

ఏయూ ఇంజినీరింగ్ విద్యార్థులకు ప్లేస్‌మెంట్స్ కష్టాలు



ఆంధ్రా యూనివర్సిటీలో నారాయణ (పేరు మార్చాం) అనే విద్యార్థి 2024–25 విద్యా సంవత్సరంలో బీటెక్ (సీఎస్) పూర్తి చేశాడు. ప్రముఖ కంపెనీలేవీ ప్లేస్‌మెంట్స్ కోసం రాకపోవడంతో గాయత్రీ కాలేజీలో జరిగే ఆఫ్–క్యాంపస్ సెలక్షన్స్‌కు వెళ్లి టీసీఎస్‌లో ఉద్యోగం సంపాదించుకున్నాడు. ఈ విధంగా ఒక్క నారాయణే కాదు 20 మంది ఏయూ విద్యార్థులు ఉద్యోగాలు పొందారు.

ఈ అమ్మాయి పేరు రేపాక ఈశ్వరి. 2022–23 విద్యా సంవత్సరంలో ఏయూలో సీఎస్ పూర్తి చేసిన ఈ అమ్మాయికి అట్లాసియన్ కంపెనీలో రూ.84.5 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం వచ్చింది. ఆఫర్ లెటర్‌ను అప్పటి ఏయూ వీసీ ప్రసాదరెడ్డి అందించారు. ఆ ఏడాది ఈ అమ్మాయికే కాదు 1,001 మంది విద్యార్థులకు వారి తల్లిదండ్రుల సమక్షంలో ఆఫర్ లెటర్స్ అందించారు.



2023 మే 1వ తేదీన బీచ్‌రోడ్‌లోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో 'అచీవర్స్ డే' ఘనంగా నిర్వహించి 1,001 మంది ఇంజినీరింగ్ విద్యార్థులకు ఆఫర్ లెటర్స్‌ను అందించారు. ఆ ఏడాది వచ్చిన అత్యధిక ప్యాకేజీ రూ.84.5 లక్షలు!

2025లో ఏయూలో ఇంజినీరింగ్ పూర్తి చేసిన వారిలో పట్టుమని 20 శాతం మందికి కూడా క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ లేని పరిస్థితి. ఆఫ్–క్యాంపస్‌లో గాయత్రీ కాలేజీకి వెళ్లి అక్కడ సెలక్షన్స్‌లో 20 మంది ఏయూ విద్యార్థులు టీసీఎస్‌లో ఉద్యోగం సంపాదించుకున్నారు. ఈ ఏడాది వచ్చిన అత్యధిక ప్యాకేజీ రూ.12 లక్షలు!

ఇదీ గత ప్రభుత్వ హయాంలో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌కు... కూటమి ప్రభుత్వంలో ఏయూలో ఇంజినీరింగ్ పూర్తి చేసిన విద్యార్థుల క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌కు మధ్య ఉన్న తేడా.



2023 మే 1వ తేదీన జరిగిన అచీవర్స్ డే కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు, తల్లిదండ్రులు

- గతంలో సగటున 1,200 నుంచి 1,600 ఉద్యోగాలకు ఆఫర్ లెటర్లు
- అచీవర్స్ డే పేరుతో తల్లిదండ్రుల సమక్షంలో ఆఫర్ లెటర్లు అందజేత
- ఇప్పుడు 185 ఉద్యోగాలకు పడిపోయిన దుస్థితి
- అందులోనూ సగం ఆఫ్–క్యాంపస్‌లో సాధించినవే..
- గతంలో అత్యధిక వార్షిక వేతనం రూ.84.5 లక్షలు.. ఇప్పుడు రూ.12 లక్షలు
- ఉద్దేశపూర్వకంగానే ఏయూపై కూటమి ప్రభుత్వం కినుక

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

ఏయూలో ఇంజనీరింగ్ పూర్తి చేసిన వారిలో 20 శాతం మందికి కూడా ఉద్యోగాలు రాని పరిస్థితి నెలకొంది. ఒక్క ప్రముఖ కంపెనీ కూడా ఏయూలో ప్లేస్‌మెంట్స్ డ్రైవ్ నిర్వహించలేదు. ఇందుకు ప్రధాన కారణం క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌పై కనీస శ్రద్ధ వహించకపోవడమే. ఈ వ్యవహారమంతా ఉద్దేశపూర్వకంగానే సాగుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. గత ఏడాదితో పాటు అంతకు ముందు మూడేళ్లు ఏటా 1,200 నుంచి 1,600 వరకూ ఏయూ ఇంజనీరింగ్ విద్యార్థులు క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో ఉద్యోగాలు సాధించారు. 2024–25 విద్యా సంవత్సరంలో ఇంజనీరింగ్ పూర్తి చేసిన వారిలో కేవలం 185 మందికి మాత్రమే ప్లేస్‌మెంట్స్ లభించడం గమనార్హం. ఇందులోనూ అనేక మంది ఆఫ్ క్యాంపస్‌లో ఉద్యోగాలు సాధించిన వారే. ఏయూ ఇంజనీరింగ్ కాలేజీలపై కూటమి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే నిర్లక్ష్యం చూపుతోందనే విమర్శలున్నాయి. విశాఖలో ఇతర ప్రైవేటు కాలేజీలకు మేలుచేకూర్చే విధంగానే వ్యవహారం ఉందనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి.

20 లక్షల ఉద్యోగాల పేరుతో...!

వాస్తవానికి ఎన్నికలకు ముందు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని... లేనిపక్షంలో నెలకు రూ. 3 వేల చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామని కూటమి నేతలు ప్రకటించారు. తీరా ఎన్నికల్లో గెలిచిన తర్వాత ఉద్యోగాల ఊసే ఎత్తడం లేదు. పైగా సూపర్ సిక్స్ అమలు చేసేశామని.. ఎవరైనా కాదంటే వారి నాలుక మందమంటూ బెదిరింపులకు దిగుతున్నారు. వాస్తవానికి ఏయూలో ఇంజినీరింగ్ సీటు మంచి ర్యాంకులు సాధించిన విద్యార్థులకే సాధ్యమవుతుంది. అటువంటి విద్యార్థులకు క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో ఉద్యోగం సంపాదించడం కూడా పెద్ద కష్టమేమీ కాదు. అయితే, ఇందుకోసం ప్రత్యేకంగా క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ నిర్వహించడం... ప్రముఖ కంపెనీలను ఆహ్వానించాల్సి ఉంటుంది. కూటమి ప్రభుత్వం క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌పై కనీస శ్రద్ధ వహించడం లేదు. దీంతో విద్యార్థులు ఆఫ్ క్యాంపస్‌లో వేరే ప్రాంతాలకు వెళ్లి ఇంటర్వ్యూలో పాల్గొని ఉద్యోగాలు సంపాదించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

ఉద్దేశపూర్వకంగానే...!

వాస్తవానికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన పలు సంస్కరణలతో పాటు అభివృద్ధి కార్యక్రమాల వల్ల ఏయూలో గణనీయ అభివృద్ధి జరిగింది. నూతన పోకడలకు అనుగుణంగా ఏయూలో కొంగొత్త మార్పులకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలో శ్రీకారం చుట్టారు. ఎన్నడూ లేని విధంగా స్టార్టప్‌ల కోసం ప్రత్యేకంగా ఏ–హబ్‌ను ఏర్పాటు చేశారు. పేటెంట్ల కోసం ఏకంగా వందకుపైగా దరఖాస్తుల చేయడం ద్వారా రాష్ట్రంలోని ఇతర యూనివర్సిటీలకు మార్గదర్శకంగా నిలిచింది. మేధో సంపత్తి హక్కులను (పేటెంట్స్) పొందేందుకుగానూ ప్రత్యేకంగా మేధో సంపత్తి హక్కుల కేంద్రం (ఐపీటీ)ని గత ప్రభుత్వ హయాంలో అప్పటి వీసీ ప్రసాద్‌రెడ్డి 2020 సెప్టెంబరులో ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఈ కేంద్రం ద్వారా వందకిపైగా దరఖాస్తులను పంపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఉద్దేశపూర్వకంగానే ఏయూ ప్రతిష్టను మంటగలిపే ప్రయత్నం జరుగుతుందన్న ఆరోపణలున్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఏదో జరిగిందనే రీతిలో ప్రచారం చేస్తూ... విచారణ పేరుతో గందరగోళాన్ని సృష్టించే ప్రయత్నం చేస్తున్నారు. అంతేకాకుండా ప్రముఖ కంపెనీలను పిలిచి క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌ను నిర్వహించడం లేదు. ఇందులో నగరంలోని ఇతర ప్రైవేటు కాలేజీలకు మేలు చేకూర్చే ఉద్దేశం ఉందన్న అభిప్రాయం బలంగా వ్యక్తమవుతోంది. గతంలో గీతం కాలేజీ ఫౌండర్ ఎంవీవీఎస్ మూర్తి.. ఏయూను దెయ్యాల కొంపగా అభివర్ణించారు. అదే ధోరణిలో ఇప్పుడు కూటమి ప్రభుత్వం కూడా క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌పై కనీస శ్రద్ధ చూపకుండా.. విద్యార్థులు ప్రైవేటు యూనివర్సిటీల్లో చేరే విధంగా వ్యవహరిస్తోందనే విమర్శలున్నాయి.

న్యూస్‌రీల్

ఏయూలో ఆస్ట్రేలియా కార్నర్?



వెస్టర్న్ ఆస్ట్రేలియా ప్రతినిధులతో ఏయూ వీసీ ఆచార్య రాజశేఖర్

మద్దిలపాలెం: యూనివర్సిటీ ఆఫ్ వెస్టర్న్ ఆస్ట్రేలియాకు చెందిన ప్రతినిధుల బృందం మంగళవారం ఆంధ్ర యూనివర్సిటీని సందర్శించింది. ఈ సందర్భంగా ఏయూ ఉపకులపతి ఆచార్య జి.పి.రాజశేఖర్‌తో వారు మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంతో కలిసి ఇంజినీరింగ్ కోర్సులను సంయుక్తంగా నిర్వహించడంపై ప్రాథమిక చర్చలు జరిపారు. అదేవిధంగా ఏయూ ప్రాంగణంలో వెస్టర్న్ ఆస్ట్రేలియా కార్నర్ ఏర్పాటు చేసే దిశగా కూడా చర్చలు సాగాయి. సంయుక్త కోర్సుల నిర్వహణకు అవసరమైన విధివిధానాలు, నియమావళిని రూపొందించిన తర్వాత మరోసారి చర్చలు జరపాలని ఇరువర్గాలు నిర్ణయించాయి. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయ్‌రావు, యూనివర్సిటీ ఆఫ్ వెస్టర్న్ ఆస్ట్రేలియా గ్లోబల్ గ్రోత్ అండ్ అడ్వకసీ విభాగం డైరెక్టర్ నషీద్ చౌదరి, గ్లోబల్ ఎంగేజ్‌మెంట్ మేనేజర్ బ్రోడెరిక్ మైకోఫ్, ఏయూ ఆర్ అండ్ డీ విభాగం డీన్ ఆచార్య వి.వల్లికుమారి, ఆచార్య డి.లలిత భాస్కర్ పాల్గొన్నారు.

మహిళా, శిశు సంక్షేమంపై ప్రాంతీయ సదస్సు రేపు

మహారాణిపేట: మహిళా అభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమం, ఐసీడీఎస్ కార్యక్రమాల నిర్వహణ, గర్భిణులు, చిన్నారులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ వంటి కీలక అంశాలపై ఈ నెల 26న విశాఖలో ప్రాంతీయ సదస్సు జరగనుంది. మహిళా అభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆర్జేడీ జి.చిన్మయిదేవి ఓ ప్రకటన విడుదల చేశారు. ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఏయూ ప్లాటినం జూబ్లీ గెస్ట్ హౌస్ మీటింగ్ హాలులో ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పీడీలు, సీడీపీవోలు, ఏసీడీపీవోలు, అంగన్‌వాడీ కార్యకర్తలు సహా పలువురు ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు.

28న సదరన్ రీజియన్ ఫిల్మ్ ఫెడరేషన్ సమావేశం

మద్దిలపాలెం: ఫెడరేషన్ ఆఫ్ ఫిల్మ్ సొసైటీస్ ఆఫ్ సదరన్ రీజియన్ సమావేశం ఈ నెల 28న విశాఖలో జరగనుంది. ఈ విషయాన్ని వైజాగ్ ఫిల్మ్ సొసైటీ అధ్యక్షుడు ఎ.కాశీవిశ్వేశ్వరరావు వెల్లడించారు. దక్షిణ భారతదేశంలోని వివిధ రాష్ట్రాల ఫిల్మ్ సొసైటీ ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొంటారు. రాబోయే రెండేళ్ల కార్యకలాపాలు, జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్స్ నిర్వహణ వంటి కీలక అంశాలపై ప్రధానంగా చర్చించనున్నారు. ఈ కార్యక్రమానికి నరవ ప్రకాశరావు నిర్వహణ అధ్యక్షుడిగా వ్యవహరిస్తారని కాశీ విశ్వేశ్వరరావు తెలిపారు.

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు



మాట్లాడుతున్న డీఆర్‌ఎం లలిత్‌బోరా

తాటిచెట్లపాలెం: డివిజనల్ రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ(డీఆర్‌యూసీసీ) 2025 తొలి సమావేశం మంగళవారం దొండపర్తిలోని డీఆర్‌ఎం కార్యాలయంలో జరిగింది. డీఆర్‌ఎం కార్యాలయం వద్ద గల కాన్ఫరెన్స్ హాల్‌లో డీఆర్‌ఎం లలిత్‌బోరా అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించారు. దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, పరిశ్రమల ప్రతినిధులు, కల్చరల్ అసోసియేషన్, ప్రయాణికుల అసోసియేషన్ ప్రతినిధులు, నామినేటెడ్ సభ్యులు మొత్తం 11 మంది ఈ సమావేశంలో పాల్గొని ప్రయాణికుల సౌకర్యాలు, సమస్యల గురించి చర్చించారు. పలు స్టేషన్లలో దివ్యాంగులకు మెరుగైన సదుపాయాలు, ప్రత్యేక రైళ్లు నడపాలని, రైళ్ల ఫ్రీక్వెన్సీ మరింత పెంచాలని, అదనపు ప్లాట్‌ఫారాలను నిర్మించాలని ప్రతినిధులు కోరారు. వీటికి స్పందించిన డీఆర్‌ఎం ప్రయాణికులకు మరింత మెరుగైన సౌకర్యాలను అందించడంలో భారతీయ రైల్వే నిరంతర కృషి చేస్తుందని తెలిపారు.

కిరండూల్ గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ కేకే లైన్ పరిధిలో జరుగుతున్న పలు ఆధునికీకరణ పనుల నిమిత్తం ఈ మార్గంలో నడిచే పలు రైళ్లు ఆయా తేదీల్లో గమ్యం కుదిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24, 26, 30, జూలై 4, 8, 15, 18, 21, 23వ తేదీల్లో విశాఖపట్నం–కిరండూల్(58501) పాసింజర్ దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 25, 27, జూలై 1, 5, 9, 16, 19, 22, 24వ తేదీల్లో కిరండూల్–విశాఖపట్నం(58502) పాసింజర్ దంతేవాడ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది.

మరణించి.. మరో ఇద్దరికి వెలుగునిచ్చి..



బీశెట్టి కనకమ్మ (ఫైల్)

పెందుర్తి: మరణంలోనూ ఓ 'అమ్మ' ఇద్దరికి కంటి వెలుగునిచ్చింది. పెందుర్తి మండలం చింతలగ్రహారం గ్రామానికి చెందిన బీశెట్టి కనకమ్మ(52) అక్కయ్యపాలెం రైతు బజార్‌లో ఆకుకూరలు విక్రయిస్తుంటుంది. మంగళవారం ఉదయం రైతుబజార్‌కు వెళ్లిన కనకమ్మకు గుండెపోటు వచ్చింది. వెంటనే తోటి రైతులు స్పందించి సమీపంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మధ్యాహ్నం మరణించింది. కనకమ్మ మృతదేహాన్ని చింతలగ్రహారానికి తరలించారు. ఈ క్రమంలో మృతురాలి బంధువు సంతోష్ ద్వారా సమాచారం అందుకున్న పెందుర్తి సాయి హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకుడు దాడి శ్రీనివాస్ కనకమ్మ కుమారులు జగదీష్, ఈశ్వరరావులను నేత్రదానానికి ఒప్పించారు. వారు అంగీకారం తెలపడంతో ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి చెందిన మొహిషిన్ ఐ బ్యాంక్ ప్రతినిధులు కనకమ్మ కార్నియాలను సేకరించారు. తల్లి మృతి చెందిన దుఃఖంలోనూ కుమారులు ఇద్దరూ చూపిన మానవత్వానికి గ్రామస్తులు ప్రశంసించారు.

గురుకులాల్లో మిగులు సీట్ల భర్తీకి ప్రవేశ పరీక్ష నేడు



సబ్బవరం: విశాఖ, అనకాపల్లి జిల్లాల్లోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలల్లో 6 నుంచి 9వ తరగతి వరకు మిగిలి ఉన్న సీట్ల భర్తీకి బుధవారం ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లాల సమన్వయాధికారి ఎస్. రామకృష్ణ తెలిపారు. బాలికలకు అనకాపల్లి జిల్లా తాళ్లపాలెంలోని బి.ఆర్.అంబేద్కర్ గురుకులంలో, బాలురకు విశాఖ జిల్లా శ్రీకృష్ణాపురంలోని బి.ఆర్.అంబేద్కర్ గురుకులంలో పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. 6, 7వ తరగతి విద్యార్థులకు ఉదయం 10 నుంచి 11 గంటల వరకు, 8, 9వ తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు పరీక్ష ఉంటుంది. విద్యార్థులు నిర్ణీత సమయానికి ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సమన్వయాధికారి రామకృష్ణ సూచించారు.

ఉచిత సీట్ల కేటాయింపులో 'ప్రైవేటు' నిర్లక్ష్యం

శ్రీ ప్రకాష్ స్కూల్ ఎదుట తల్లిదండ్రుల నిరసన



పాఠశాల వద్ద ఆందోళన చేస్తున్న తల్లిదండ్రులు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు కాపులుప్పాడ ప్రాంతంలోని శ్రీ ప్రకాష్ పాఠశాలలో ఉచిత సీట్ల కేటాయింపులో యాజమాన్యం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపిస్తూ.. మంగళవారం ఆ స్కూల్ ఎదుట తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. ప్రభుత్వం కేటాయించిన ఉచిత సీట్లను మంజూరు చేయడంలో జాప్యం చేస్తోందని ఆరోపించారు. వివరాల్లోకి వెళ్తే.. మొదటి విడతలో 8 మంది, రెండవ విడతలో 5 గురు విద్యార్థులకు శ్రీప్రకాష్ పాఠశాలలో ఉచిత ప్రవేశాలకు ప్రభుత్వం సీట్లు కేటాయించింది. మే 29న తమ పిల్లలకు సీట్లు వచ్చిన వెంటనే తల్లిదండ్రులు పాఠశాల యాజమాన్యాన్ని సంప్రదించారు. అయితే అప్పటి నుంచి ఇప్పటి వరకు వారికి సీట్లు కేటాయించకపోవడంతో దాదాపు నెల రోజులుగా పాఠశాల చుట్టూ తిరుగుతున్నామని తల్లిదండ్రులు వాపోయారు. ఈ విషయంపై డీఈవో, ఎంఈవో కార్యాలయాలకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో తాము ఆందోళనకు దిగినట్లు తెలిపారు. తమకు న్యాయం జరిగే వరకు ఆందోళన విరమించేది లేదని స్పష్టం చేశారు. ఇప్పటికే అన్ని పాఠశాలల్లో తరగతులు ప్రారంభమై, అడ్మిషన్లు పూర్తయిన తరుణంలో ఉచిత సీట్లు లేవని చేతులెత్తేస్తే తమ పిల్లల భవిష్యత్తు ఏమిటని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై పాఠశాల యాజమాన్యాన్ని వివరణ కోరగా.. వారు ఎటువంటి సమాధానం ఇవ్వలేదు. ఆందోళన సమాచారం అందుకున్న డిప్యూటీ డీఈవో సోమేశ్వరరావు, ఎంఈవో శివరాణి పాఠశాల యాజమాన్యంతో మాట్లాడి విద్యార్థులకు ఉచిత సీట్లు అందిస్తామని తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు. దీంతో వారు ఆందోళన విరమించారు.

లోక్ అదాలత్‌తో తక్షణ పరిష్కారం

విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజా



ప్రసంగిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజా

విశాఖ లీగల్ : న్యాయస్థానాల్లో అపరిష్కృతంగా ఉన్న కేసులను రాజీ చేసుకోవడానికి మెగా లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజా కోరారు. జూలై 5వ తేదీన జరిగే మెగా లోక్ అదాలత్ విజయవంతం చేసే దిశగా అధికారులు, పోలీసు యంత్రాంగం, బీమా కంపెనీలు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు, బ్యాంక్ అధికారులు, వివిధ కంపెనీల న్యాయ సలహాదారులతో ఆయన మంగళవారం నూతన న్యాయస్థానాల సముదాయంలోని సమావేశంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెగా లోక్ అదాలత్ విజయవంతం చేయాలన్నారు. బీమా కంపెనీలు, పోర్ట్ ట్రస్టు, స్టీల్ ప్లాంట్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రైవేట్ సంస్థలు, రాజీ కాగలిగిన క్రిమినల్ కేసులు రాజీ చేసుకోవాలన్నారు. రాజీ మార్గమే రాజీమార్గమన్నారు. కార్యక్రమంలో కుటుంబ న్యాయస్థానం న్యాయమూర్తి రాధారత్నం, రెండో అదనపు జిల్లా న్యాయమూర్తి సి.కె.గాయత్రి, లోక్ అదాలత్ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, నగర పోలీస్ నేర విభాగం డిప్యూటీ పోలీసు అధికారి మాధవీలత, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎంకే శ్రీనివాస్, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, వివిధ కంపెనీల న్యాయ సహాయకులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఉద్రిక్తత నడుమ 'ఎంటీఎస్' కౌన్సెలింగ్



డీఈవో కార్యాలయం ముందు ఎంటీఎస్ టీచర్ల నిరసన

ఆరిలోవ: మినిమమ్ టైమ్ స్కేల్ (ఎంటీఎస్) టీచర్లకు మంగళవారం ఆందోళనల నడుమ కౌన్సెలింగ్ జరిగింది. ఏజెన్సీ ప్రాంతాల్లోని ఖాళీలను చూపించి బదిలీ ప్రక్రియ చేపడుతున్నారని, తమను మైదాన ప్రాంతాలకు బదిలీ చేయాలని డిమాండ్ చేస్తూ మూడు రోజులుగా ఎంటీఎస్ ఉపాధ్యాయులు ఆందోళన చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం డీఈవో కార్యాలయంలో జిల్లా విద్యాశాఖాధికారులు వీరికి కౌన్సెలింగ్ నిర్వహించారు. తమ సమస్యలు పరిష్కారం అయ్యే వరకు కౌన్సెలింగ్‌కు ఎవరూ హాజరు కావద్దని ఎంటీఎస్ ఉపాధ్యాయులు మరోసారి డీఈవో కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. ఈ ఆందోళన జరుగుతుండగానే 1998, 2008 డీఎస్సీ బ్యాచ్‌లకు చెందిన కొందరు ఉపాధ్యాయులు 'మేం కౌన్సెలింగ్‌కు హాజరవుతాం' అంటూ కార్యాలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో మిగిలిన వారు వారిని అడ్డుకోవడంతో గందరగోళం నెలకొంది. ఈ పరిణామాల నేపథ్యంలో డీఈవో ఎస్.ప్రేమ్‌కుమార్ ఆరిలోవ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు డీఈవో కార్యాలయం వద్ద బందోబస్తు ఏర్పాటు చేయడంతో అధికారులు సుమారు 50 మందికి పైగా ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. మిగిలిన వారు బుధవారం జరిగే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు. ఇదిలావుండగా తమ డిమాండ్ల పరిష్కారం కోసం విశాఖ ఎంపీ శ్రీభరత్, ఇతర ఎమ్మెల్యేలను కలవనున్నట్లు ఎంటీఎస్ ఉపాధ్యాయ యూనియన్ నాయకులు తెలిపారు.

మారుమూల ప్రాంతాలకు వెళ్లాలని ఒత్తిడి

రెండో రోజు కొనసాగిన ఎంటీఎస్ టీచర్ల నిరసన



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఎంటీఎస్ టీచర్ల ఆందోళన

బీచ్‌రోడ్డు: దూర ప్రాంతాలకు, రవాణా సౌకర్యం లేని మారుమూల పాఠశాలలకు వెళ్లాలని కూటమి ప్రభుత్వం తమపై ఒత్తిడి తెస్తోందని 1998, 2008 ఎంటీఎస్ టీచర్లు ఆవేదన వ్యక్తం చేశారు. రెగ్యులర్ ఉపాధ్యాయుల బదిలీ కౌన్సెలింగ్ తర్వాత మిగిలిపోయిన ఖాళీలను తమతో భర్తీ చేయాలని అధికారులు భావిస్తున్నారని తెలిపారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద రెండో రోజైన మంగళవారం తమ నిరసనను కొనసాగించారు. మారుమూల పాఠశాలలను ఎంచుకోవాలని ఒత్తిడి చేయడం వల్ల తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నామని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. తమలో చాలా మంది 55 ఏళ్లు పైబడిన వారని, 70 శాతం మంది మహిళలే ఉన్నారని ఉపాధ్యాయులు తెలిపారు. ఈ పరిస్థితుల్లో ఏజెన్సీ ప్రాంతాలకు పంపి పని చేయాలనడం బాధాకరమని వాపోయారు. ప్రస్తుతం ఇస్తున్న రూ. 32 వేల వేతనంతో కుటుంబాన్ని పోషించుకుంటూ.. మారుమూల ప్రాంతాల్లో పనిచేయడం తమ శక్తికి మించిన భారం అవుతుందని ఆవేదన చెందుతున్నారు. ఆర్.సి.నంబర్ 39 ఉత్తర్వుల ప్రకారం తమ నివాస ప్రాంతాలకు దగ్గరలో పోస్టింగ్ ఇవ్వాలని లేదా మైదాన ప్రాంతాల్లోని ఏకోపాధ్యాయ పాఠశాలలో రెండవ ఉపాధ్యాయునిగా నియమించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రం మొత్తం మీద విశాఖ పరిస్థితి ప్రత్యేకమైనదని, తమకు తగిన న్యాయం చేసి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

క్షతగాత్రులకు ప్రాణాపాయం లేదు

పరవాడ: లంకెలపాలెం కూడలిలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన 10 మంది క్షతగాత్రులు నగరంలోని కేజీహెచ్, కిమ్స్ తదితర ఆస్పత్రుల్లో చికిత్సలు పొందుతున్నారని పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు చెప్పారు. ప్రస్తుతం గాయపడిన వారికి ఎలాంటి ప్రాణాపాయం లేదన్నారు. రోడ్డు ప్రమాదంలో అనకాపల్లికి చెందిన కొణతాల అచ్చెంనాయుడు, రేబాకకు చెందిన పచ్చికూర గాం., దీ, ఫార్మా ఉద్యోగి ఎర్రప్పడు మృతి చెందిన విషయం తెలిసిందే. వీరి మృతదేహాలకు మంగళవారం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు. రోడ్డు ప్రమాదం జరిగిన తీరుపై అన్ని కోణాల్లో విచారణ జరిపి.. బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

పెళ్లికి ముందే దారుణం

ఇంట్లోకి చొరబడి యువతి, ఆమె తల్లిని కొట్టిన వైనం



సాయి కిశోర్ స్నేహితులు



సాయి కిశోర్

తగరపువలస: వివాహ బంధంలోకి అడుగు పెట్టక ముందే కట్నం వేధింపులకు పాల్పడి.. ఏకంగా ఇంట్లోకి చొరబడి తల్లీకూతుళ్లపై దాడి చేసిన సంఘటన స్థానికంగా కలకలం రేపింది. విజయనగరానికి చెందిన ముల్లు సాయి కిశోర్ మంగళవారం రాత్రి జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు జీరుపేటలో ఈ దారుణానికి పాల్పడ్డాడు. నెల రోజుల కిందట సాయి కిశోర్‌కు ఆ గ్రామానికి చెందిన యువతితో నిశ్చితార్థం జరిగింది. అప్పటి నుంచి రూ.6 లక్షల కట్నం డబ్బులు ఇవ్వాలని సాయికిశోర్‌తో పాటు అతని కుటుంబ సభ్యులు యువతిని వేధించడం మొదలుపెట్టారు. తరచూ ఖర్చులకు డబ్బులు కావాలని డిమాండ్ చేశారు. ఆమె క్రెడిట్ కార్డును కూడా కిశోర్ వాడేశాడు. ఈ వేధింపులు తారస్థాయికి చేరడంతో అమ్మాయి తరపు కుటుంబం నిందితుడి నుంచి దూరంగా ఉండాలని నిర్ణయించుకుంది. అయితే మంగళవారం రాత్రి సాయి కిశోర్.. విజయనగరానికి చెందిన తన స్నేహితులైన కోరాడ హరనాథ్, చెల్లూరు పవన్‌కుమార్, తాళాడ శ్రవణ్‌లను కారులో వెంటబెట్టుకుని జీరుపేటలోని ఆమె ఇంటికి వచ్చాడు. దౌర్జన్యంగా ఇంట్లోకి చొరబడి తల్లి, కూతుళ్లను జుట్టు పట్టుకుని బయటకు ఈడ్చుకొచ్చి దారుణంగా కొట్టాడు. ఈ దారుణాన్ని చూసిన స్థానికులు అడ్డుకోవడానికి ప్రయత్నించగా సాయి కిశోర్.. యువతి తల్లి మెడలో ఉన్న బంగారు హారాన్ని లాక్కొని కారుతో పరారయ్యాడు. గ్రామస్తులు మిగిలిన ముగ్గురిని పట్టుకుని భీమిలి పోలీసులకు అప్పగించారు. బుధవారం ఉదయం స్టేషన్‌కు రావాలని ఇరువర్గాలను పోలీసులు ఆదేశించారు.

నేలవేషాలు C/o ముచ్చర్ల



అమ్మవార్ల పాత్రలు



లవకుశులు, అయ్యప్పస్వామిగా చిన్నారులు



దుర్యోధనుడు, దుశ్శాసనుడు, భీముడు,కర్ణుడు పాత్రధారులు



దేవతా వస్త్రాలు



ముచ్చర్ల పాఠశాలలో మేకప్ వేస్తున్న కళాకారులు

తగరపువలస : గ్రామదేవతల ఉత్సవాలు, వినాయక నిమజ్జనం, శరన్నవరాత్రి ఉత్సవాల్లో ప్రముఖంగా కనిపించే నేలవేషాలు ప్రస్తుతం దాదాపు కనుమరుగైపోయాయి. అప్పట్లో పురాణ పురుషుల వేషాలు కట్టిన కళాకారులను దేవుని ముందు ఊరేగింపుగా ఎడ్లబండ్లపై తీసుకువెళ్లేవారు. వాళ్లను కూడా ప్రజలు భక్తిభావంతో చూసేవారు. ప్రస్తుతం నేలవేషాల స్థానంలో డీజే, కోలాటం, కాళికా నృత్యాలు వంటివి ప్రదర్శిస్తున్నారు. గ్రామాల్లో ఎడ్ల బండ్లు కూడా కనిపించకుండా పోయాయి. ఆనందపురం మండలం ముచ్చర్ల పంచాయతీవాసులు మాత్రం ఈ ఆనవాయితీని కొనసాగిస్తున్నారు. గ్రామదేవత బంగారమ్మ పండగలో చిన్నారులు మొదలుకుని యువకుల వరకు రామాయణం, మహాభారతం, భాగవతంలో పాత్రలతో పాటు అమ్మవార్లు, చాకలి తిప్పడు, షావుకారు, భైరవుడు, చిత్రగుప్తుడు తదితర వేషాలతో అలరిస్తున్నారు. అనకాపల్లి నుంచి మేకప్ కళాకారులు, డ్రస్సులు, కిరీటాలు, మేకప్ కిట్లు పట్టుకుని వచ్చారు. ఒక్కో నేలవేషానికి అలంకరణ బట్టి మేకప్‌తో కలిపి రూ.1000 నుంచి రూ.2000 ఖర్చు అవుతుంది. దీనిని ఉత్సవ కమిటీయే భరిస్తుంది.



కిరీటాలు, పూలదండలు

ఈ ఏడాది 60 మంది ముందుకు..

పూర్వం నుంచి వస్తున్న ఆనవాయితీ ప్రకారం అమ్మవారికి మొక్కుకునేవారు ఈ వేషాలు వేయడానికి ముందుకు వస్తారు. అభినయం అక్కరలేకపోయినప్పటికీ కేవలం వేషం ద్వారా గ్రామస్తులు, బంధువులను మెప్పిస్తుంటారు. వేసిన పౌరాణిక పాత్రలో ఒదిగిపోతారు. కళాకారులు ఎక్కువైతే పలువురు ఒకే పాత్రలో అలరిస్తుంటారు. ఈ ఏడాది ముచ్చర్ల ఉత్సవ కమిటీ ఈ నేలవేషాలకు రూ.1.5 లక్షలు ఖర్చు చేస్తుంది. ఎండ్లబండ్ల స్థానంలో ట్రాక్టర్లు ప్రవేశించినా గత వైభవానికి తగ్గకుండా ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. మంగళవారం జరిగిన అనుపోత్సవంలో 60 మంది వరకు నేలవేషగాళ్లు అలరించారు. వీరిని చూడటానికే చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాది మంది ముచ్చర్ల తరలివచ్చారు.



అమ్మవారి అలంకరణలో యువకుడు

సరదాతో పాటు మొక్కు

పురాణ పురుషుల వేషాలు ధరించడం వెనుక మొక్కు, సరదా, ఆనందం దాగి ఉంది. పూర్వం నుంచి మా గ్రామంలో వస్తున్న ఆనవాయితీ.

– షిణగం అప్పలస్వామి, ముని వేషధారి



మా గ్రామానికే పరిమితం

మా గ్రామంలో తప్ప ఇంకా ఎక్కడా ఈ వేషాలు కట్టం. కొందరు మాత్రం బయట గ్రామాలకు వెళ్తుంటారు. మేకప్, అలంకరణ ఖర్చులు భరిస్తుంటారు.

– షిణగం అప్పలరాజు, చిత్రగుప్తుడు వేషధారి



అదివో జగన్నాథుడు.. అల్లదివో రథోత్సవం

- 27న జగన్నాథ స్వామి రథయాత్ర
- దేవదాయ శాఖ, ఇస్కాన్, హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు



ఉత్సవ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఇస్కాన్ విశాఖ శాఖ అధ్యక్షుడు సాంబదాస్, మాతాజీ



వివరాలు వెల్లడిస్తున్న హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రతినిధి యదురాజ దాస

డాబాగార్డెన్స్: నగరంలో ఈ నెల 27న అంగరంగ వైభవంగా జగన్నాథ రథయాత్ర జరగనుంది. టౌన్ కొత్తరోడ్డులోని జగన్నాథస్వామి ఆలయంతో పాటు సాగర్‌నగర్‌లోని ఇస్కాన్ టెంపుల్, హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో ఈ వేడుకల నిర్వహణకు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తయ్యాయి.

టౌన్ కొత్తరోడ్డులో..

టౌన్‌కొత్తరోడ్డులో వెలసిన జగన్నాథస్వామి ఆలయంలో ఈ నెల 24 నుంచి జూలై 8 వరకు రథయాత్ర మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఈవో టి.రాజగోపాల్ రెడ్డి తెలిపారు. ఆలయ అర్చకులు పాణంగిపల్లి జగన్నాథాచార్యులు, రంగనాథాచార్యులు, కేశవాచార్యులు, యేడిద సురేష్‌బాబుతో కలిసి మంగళవారం రథయాత్ర పోస్టర్ ఆవిష్కరించారు. కాగా.. మంగళవారం సాయంత్రం ప్రతిష్టా ప్రారంభ సంకల్పంతో ఉత్సవాలు మొదలయ్యాయి. బుధవారం ఉదయం జలాధివాసములు, క్షీరాధివాసములు, రాత్రి విశేష హోమాలు, పంచశయ్యాది వాసములు, 26న ఉదయం పూర్ణాహుతి నేత్రోత్సవం, సాయంత్రం 6.30 గంటలకు ధ్వజారోహణం, సుభద్రాదేవి శాంతి కల్యాణం జరపనున్నారు. 27న ఉదయం 9.10 గంటలకు స్వామిని రథంపైకి ఆహ్వానిస్తారు. సాయంత్రం 5 గంటలకు జగన్నాథస్వామి తొలి రథయాత్ర మహోత్సవం అత్యంత వైభవంగా ప్రారంభమవుతుంది. 28 నుంచి జూలై 6 వరకు టర్నర్ చౌల్ట్రీ కల్యాణ మండపంలో స్వామి దశావతారాల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు. 7న ఉదయం 9.45 గంటలకు స్వామి తిరుగు రథయాత్ర నిర్వహిస్తారు. 8న ఉదయం సంప్రోక్షణ, పీఠారోహణం అనంతరం స్వామిని యథాస్థానంలో ప్రతిష్టిస్తారు.

ఇస్కాన్ ఆధ్వర్యంలో..

నగరంలో ఈ నెల 27న ఇస్కాన్ ఆధ్వర్యంలో 18వ జగన్నాథ రథయాత్ర వైభవంగా జరగనుంది. పూరీ జగన్నాథస్వామి రథయాత్ర పద్ధతిలో ఈ వేడుకను నిర్వహించనున్నట్లు ఇస్కాన్ విశాఖ శాఖ అధ్యక్షుడు సాంబదాస్, నితాయి సేవినీ మాతాజీ వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం నగరంలోని ఓ హోటల్‌లో రథయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించి వివరాలు వెల్లడించారు. ఏటా మాదిరి గానే జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్రాదేవిల కోసం మూడు వేర్వేరు రథాలను సిద్ధం చేశారు. శ్రీల ప్రభుపాదుల విగ్రహాన్ని ఒక చిన్న రథంపై ఉంచి ఊరేగిస్తారు. ఒడిశాలోని పిప్పిలి నుంచి ప్రత్యేక అలంకరణ సామగ్రిని తెప్పించారు. 37 అడుగుల ఎత్తైన రథ గోపురాలు ట్రాఫిక్ అవసరాలకు అనుగుణంగా ఎత్తును తగ్గించుకునే, పెంచుకునే వెసులుబాటు కలిగి ఉండటం విశేషం. 27వ తేదీ సాయంత్రం 4 గంటలకు పాతజైలు రోడ్డులోని విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాల ఎదురుగా ఉన్న పార్కింగ్ ఏరియా నుంచి రథయాత్ర ప్రారంభమవుతుంది. ఎల్ఐసీ అంబేడ్కర్ కూడలి, డాబాగార్డెన్స్, ప్రెస్‌క్లబ్ జంక్షన్, ప్రకాశరావుపేట జంక్షన్ మీదుగా జగదాంబ జంక్షన్‌కు చేరుకుని, అక్కడి నుంచి వాల్తేర్ అప్‌రోడ్డు మీదుగా సిరిపురం జంక్షన్, గురజాడ కళాక్షేత్రం వరకు రథయాత్ర సాగుతుంది. రథయాత్ర పొడవునా రాష్ట్రం నలుమూలల నుంచి, బెంగాల్, ఒడిశా నుంచి వచ్చిన భక్తుల నృత్య కీర్తనలు, కోలాటాలు ప్రదర్శించి రథయాత్రకు శోభను చేకూర్చనున్నారు. గురజాడ కళాక్షేత్రం చేరుకున్న తర్వాత స్వామి వారి లీలా విశేషాలను వివరించి, భక్తులు ప్రేమతో సిద్ధం చేసిన 1008 రకాల ప్రత్యేక వంటకాలను స్వామికి సమర్పిస్తారని సాంబదాస్ వివరించారు.

హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో..

హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో ఈ నెల 27న జగన్నాథ స్వామి రథయాత్రను వైభవంగా నిర్వహించనున్నారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రతినిధి యదురాజ దాస ఈ కార్యక్రమ వివరాలను వెల్లడించారు. 27 సాయంత్రం 5 గంటలకు సంప్రదాయ పద్ధతిలో ఎంవీపీ కాలనీలోని ఐఏఎం కళాశాల నుంచి రథయాత్ర ప్రారంభమవుతుంది. ఎంవీపీ డబుల్ రోడ్డు, ఇసుకతోట జాతీయ రహదారి, వెంకోజీపాలెం, క్యాన్సర్ హాస్పిటల్, బీచ్ రోడ్డు, అప్పుఘర్ మీదుగా తిరిగి ఐఏఎం కళాశాల వరకు యాత్ర సాగుతుంది. ఈ ఉత్సవం జగన్నాథుడు, బలభద్రుడు, దేవి సుభద్రల దివ్య ప్రయాణాన్ని గుర్తు చేస్తుందని, భారతీయ సంస్కృతిలో పాతుకుపోయిన ఈ కార్యక్రమం సార్వత్రిక సౌభ్రాతృత్వం, ప్రేమ, భక్తిని సూచిస్తుందని యదురాజ దాస తెలిపారు. రథయాత్రలో ఉత్సాహభరితమైన సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయని పేర్కొన్నారు. డాక్టర్ నిష్కించిన భక్త దాస అధ్యక్షతన ఈ కార్యక్రమం జరుగుతుందని, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన కోరారు.

వేట సాఫీగా సాగాలని.. గంగమ్మకు పూజలు



సముద్రుడికి పూజలు చేసేందుకు వెళుతున్న మత్స్యకార మహిళలు

మహారాణిపేట: 'గంగమ్మ తల్లీ కాపాడు'అంటూ మత్స్యకార మహిళలు సముద్రుడికి భక్తితో ప్రణమిల్లారు. చేపల వేటలో తమ వారికి విస్తారంగా మత్స్య సంపద దొరకాలని, వేటకు వెళ్లిన వారు క్షేమంగా తిరిగి రావాలని కోరుకుంటూ మంగళవారం ఫిషింగ్ హార్బర్‌లో గంగమ్మ మారువారం పండగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శ్రీ గంగా భవానీ చేపల వేట సంఘం ఆధ్వర్యంలో ఈ వేడుక కనులపండువగా సాగింది. ఇందులో భాగంగా హార్బర్‌లోని గంగమ్మ తల్లి ఆలయంలో మహిళలు పెద్ద సంఖ్యలో పసుపు, కుంకుమలతో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం డ్రై ఫిష్ మహిళా సంఘం సభ్యులు, ఇతర మహిళలు కలశాలతో ఊరేగింపుగా బయలుదేరి సముద్రుడికి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కులు చెల్లించారు. మరపడవల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పి.సి.అప్పారావు, అధ్యక్షుడు ఎం.లక్ష్మణరావు, నాయకులు ముస్నం బాలాజీ, ఎం.సోములమ్మ, డి.ఎర్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

20 ఏళ్ల నరకానికి తెర

అరుదైన శస్త్రచికిత్సతో యువకుడికి పునర్జన్మ!



ఆరోగ్యంగా ఉన్న యువకుడితో కిమ్స్ ఐకాన్ వైద్యులు

మహారాణిపేట: వెన్నెముక లోపంతో ఇరవై ఏళ్లుగా నరకయాతన అనుభవిస్తున్న ఓ యువకుడికి కిమ్స్ ఐకాన్ ఆసుపత్రి వైద్యులు అరుదైన శస్త్రచికిత్సతో కొత్త జీవితాన్ని ప్రసాదించారు. మూత్ర విసర్జనపై నియంత్రణ లేకపోవడం, మూత్రం లీకేజీ కారణంగా తీవ్రమైన కిడ్నీ సమస్యలతో బాధపడుతున్న అతనికి శస్త్రచికిత్స చేసి సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆసుపత్రికి చెందిన కన్సల్టెంట్ యూరాలజిస్ట్ డాక్టర్ కుచ్చర్లపాటి అభిరామ్ వెల్లడించారు. పాడిరైతు కుటుంబానికి చెందిన 18 ఏళ్ల డిగ్రీ విద్యార్థి పుట్టుకతోనే 'స్పైనల్ మైలోమెనింగోసీల్'అనే వెన్నెముక సమస్యతో బాధపడుతున్నా డు. దీని వల్ల నరాలు దెబ్బతిని, మూత్రాశయం పూర్తిగా కుచించుకుపోయింది. ఫలితంగా అతడు సొంతంగా మూత్ర విసర్జన చేయలేని దుస్థితి ఏర్పడింది. నిరంతరం మూత్రం లీకవుతుండటంతో నలుగురిలోకి వెళ్లలేక తీవ్రమైన మానసిక వేదన అనుభవించేవాడు. ఈ సమస్య అతని కిడ్నీలను కూడా తీవ్రంగా దెబ్బతీసింది. ఈ సంక్లిష్టమైన సమస్యకు పరిష్కారం చూపేందుకు కిమ్స్ ఐకాన్ యూరాలజిస్టులు డాక్టర్ పి.మురళీకృష్ణ, డాక్టర్ కె.అభిరామ్, డాక్టర్ కె. సందీప్ రెడ్డిల బృందం ముందుకొచ్చింది. రెండు దశల పునర్నిర్మాణ శస్త్రచికిత్సకు ప్రణాళిక రచించారు. మొదటి దశలో రోగి పేగులోని కొంత భాగాన్ని తీసుకుని, కుచించుకుపోయిన మూత్రాశయాన్ని విస్తరించారు. రెండో దశలో కాలువ ద్వా రా రోగి ఒక సన్నని క్యాథెటర్ ట్యూబు సహాయంతో తనకు తానుగా, పూర్తి నియంత్రణతో మూత్ర విసర్జన చేయగలుగుతున్నాడు. శస్త్రచికిత్స అనంతరం యువకుడి జీవితం పూర్తిగా మారిపోయింది. మూత్రం లీకేజీ సమస్య పూర్తిగా ఆగిపోయింది. దెబ్బతిన్న కిడ్నీల పనితీరు మెరుగుపడి, సాధారణ స్థాయికి చేరుకుంది. ఇప్పుడు అతను రోజుకు మూడు, నాలుగు సార్లు సులభంగా, ఎలాంటి ఇబ్బంది లేకుండా మూత్ర విసర్జన చేసుకోగలుగుతున్నాడు. సామాజికంగా తలదాచుకోవాల్సిన అవసరం లేకుండా, తోటి వారితో కలిసి సాధారణ జీవితం గడుపుతున్నాడని డాక్టర్ అభిరామ్ తెలిపారు.

పెదగాడి సర్పంచ్ భర్తపై దాడి!

జనసేన నాయకులపై పోలీసులకు ఫిర్యాదు





లేఅవుట్‌లో చదును చేస్తున్న జనసేన నాయకులు, చికిత్స పొందుతున్న త్రినాథ్

పెందుర్తి: తనపై జనసేన నాయకులు దాడి చేసి హత్యాయత్నానికి ప్రయత్నం చేశారని పెదగాడి సర్పంచ్ కేసుబోయిన లావణ్య భర్త కేసుబోయిన త్రినాథ్ పెందుర్తి పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. తనకు చెందిన లేఅవుట్‌లోని ప్లాట్‌లోకి అక్రమంగా చొరబడిన జనసేన నాయకులను అడ్డుకున్నందుకు తనపై దాడి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దాడిలో తనను తీవ్రంగా గాయపరిచిన జనసేన నాయకులు నీటిపల్లి రమేష్, గళ్లా అప్పలరాజు సహా వారి అనుచరులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా ఇక్కడి సర్వే నంబర్ 96/3లోని లేఅవుట్‌లో ఓ ప్లాట్ విషయంలో కొద్ది రోజులుగా సర్పంచ్ లావణ్య భర్త త్రినాథ్, జనసేన నాయకుల మధ్య తగాదా ఉంది. దీనిపై ఇరుపక్షాల ఫిర్యాదుల మేరకు రెండు రోజుల కిందట కేసులు నమోదు చేసినట్లు సీఐ కె.వి.సతీష్‌కుమార్ తెలిపారు. తాజాగా వివాదంపై కూడా సమగ్ర విచారణ చేపడతామని సీఐ వెల్లడించారు.

సింహాద్రిపురం దొంగతనం కేసు ఛేదన


రూ. 9.25 లక్షల బంగారం రికవరీ



వివరాలు వెల్లడిస్తున్న క్రైం ఏసీపీ లక్ష్మణరావు

ఎంవీపీకాలనీ: సింహాద్రిపురంలో జరిగిన దొంగతనం కేసును ఎంవీపీకాలనీ క్రైం పోలీసులు ఛేదించారు. రూ.9.25 లక్షల విలువైన బంగారు ఆభరణాలను రికవరీ చేశారు. మంగళవారం ఎంవీపీ కాలనీ పోలీస్ స్టేషన్‌లో ద్వారకా జోన్ క్రైం ఏసీపీ లక్ష్మణరావు ఈ వివరాలను వెల్లడించారు. రామభక్త రామలక్ష్మి తన కుటుంబ సభ్యులతో కలిసి సింహాద్రిపురం స్టీల్ ప్లాంట్ క్వార్టర్స్‌లో నివాసముంటోంది. ఈ ఏడాది ఏప్రిల్ 24న ఓ ఫంక్షన్‌కు వెళ్లేందుకు సిద్ధమవుతున్న తరుణంలో ఇంట్లోని బీరువా తెరచి చూడగా బంగారు ఆభరణాలు కనిపించలేదు. దొంగతనం జరిగిందని గుర్తించి, ఆమె ఎంవీపీ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ద్వారకా క్రైం సీఐ చక్రధర్‌రావు, ఎంవీపీ క్రైం ఎస్ఐ అప్పలరాజు, ఏఎస్ఐ కిశోర్ బాబు తదితరులతో కూడిన బృందం రెండు నెలలపాటు దర్యాప్తు చేపట్టింది. ఎట్టకేలకు ఈ కేసును ఛేదించి, రామలక్ష్మి ఇంటికి సమీపంలోనే నివాసముంటున్న కనకాల భవానీ మరో ఇద్దరు మైనర్లతో కలిసి ఈ దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించారు. రామలక్ష్మి ఇంటి సమీపంలోని సీసీ కెమెరాను పరిశీలించగా, ఇద్దరు మైనర్లు అనుమానాస్పదంగా తిరుగుతున్నట్లు కనిపించింది. వారిని స్టేషన్‌కు తీసుకొచ్చి విచారించగా.. భవానీ ప్రమేయం వెలుగులోకి వచ్చింది. మహిళా పోలీసులు తమదైన శైలిలో భవానీని విచారించగా, ఆమె నేరాన్ని అంగీకరించింది. దీంతో ఆమెను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. ఆమె నుంచి రూ. 9.25 లక్షలు విలువ చేసే బంగారు ఆభరణాలను (45 తులాల బంగారు హారం, ఉంగరం, పాపిడి బిళ్ల) పోలీసులు రికవరీ చేశారు. కేసును ఛేదించిన బృందాన్ని క్రైం ఏసీపీ లక్ష్మణరావు అభినందించారు. సమావేశంలో సీఐ చక్రధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ హైడ్రోగ్రఫీ దినోత్సవం



అవగాహన కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు, నేవీ సిబ్బంది

సింధియా: ప్రపంచ హైడ్రోగ్రఫీ దినోత్సవం తూర్పు నావికాదళం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఈఎన్‌సీ ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్, వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్.. హైడ్రోగ్రఫీ ప్రాముఖ్యతను వివరించారు. ఇటీవల అత్యాధునిక సర్వే నౌకలను ప్రారంభించిన రెండు రాష్ట్రాలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ వేడుకల్లో గీతం, ఆంధ్ర విశ్వవిద్యాలయాలు, వెల్ఫేర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ (విస్టమ్), నేవీ చిల్డ్రన్స్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు, ఎన్‌సీసీ క్యాడెట్లు కలిపి మొత్తం 300 మంది ఉత్సాహంగా పాల్గొన్నారు. వీరు నావికాదళంలోని వివిధ నౌకలు, హైడ్రోగ్రాఫిక్ సర్వే యూనిట్లు, నావల్ చార్ట్ డిపోలను సందర్శించారు. సముద్ర గర్భ డేటాను సేకరించే అత్యాధునిక హైడ్రోగ్రాఫిక్ పరికరాలను, అవి సముద్ర, జాతీయ భద్రతకు ఏ విధంగా ఉపయోగపడతాయో నౌక సిబ్బంది విద్యార్థులకు వివరించారు. అనంతరం కమోడోర్ ఎ.మురళీధర్ నావికాదళ సిబ్బందికి హైడ్రోగ్రఫీ, సముద్ర సరిహద్దులపై అవగాహన కల్పించారు. విదేశీ సహకార సర్వేల ద్వారా హిందూ మహాసముద్రంలో భారత నావికాదళ హైడ్రోగ్రాఫిక్ కార్యకలాపాల పరిధిని విస్తరించినట్లు నేవీ వర్గాలు ఈ సందర్భంగా వెల్లడించాయి.